
సాక్షి
పల్నాడు
ఆదివారం । 26 । మే । 2024



సబ్‌జైలు తనిఖీ

గురజాల: సబ్‌జైల్‌ను శనివారం సాయంత్రం సబ్ కోర్టు న్యాయమూర్తి వై శ్రీనివాసరావు తనిఖీ చేశారు. వంటగదిని, ఖైదీలకు అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ముగిసిన పెద్దింటమ్మ వార్షికోత్సవాలు



అమరావతి: అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మ వార్షికోత్సవాలు పూర్ణాహుతితో ముగిశాయి. శనివారం ఉదయాన్నే అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేసి అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్‌రూమ్‌కు చేరిన పోస్టల్, హోమ్ ఓటింగ్ బాక్సులు



నరసరావుపేటరూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్ శనివారం పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు భద్రపరిచిన కాకానిలోని జేఎన్‌టీయూఎన్ కళాశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ బాక్సులను శనివారం స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. బాక్సులను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచే ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బీ లత్కర్ పర్యవేక్షించారు. పటిష్ట బందోబస్తు మధ్య పోస్టల్ బ్యాలెట్ బాక్సులను నియోజకవర్గాల నుంచి స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ ఆన్‌లైన్ వాల్యుయేషన్‌పై శిక్షణ తరగతులు

నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియేట్ బోర్డు నూతనంగా ప్రవేశపెట్టనున్న ఆన్‌లైన్ వాల్యుయేషన్ (మూల్యాంకనం)పై జూనియర్ కళాశాలల అధ్యాపకులకు ఆదివారం ఒకరోజు అవగాహన, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి శనివారం తెలిపారు. జిల్లా పరిధిలోని జూనియర్ అధ్యాపకులకు రావిపాడురోడ్డులోని ఆక్స్‌ఫర్డ్ విట్ జూనియర్ కళాశాలలో ఉదయం 10.30గంటల నుంచి శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్టు వివరించారు. జిల్లాలోని ప్రతి కళాశాల నుంచి జ్ఞానభూమి పోర్టల్‌లో నమోదైన ప్రతి అధ్యాపకుడు శిక్షణ తరగతులకు హాజరు కావాలని స్పష్టం చేశారు. హాజరు కాని కళాశాలల యాజమాన్యాలపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా

తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని ప్రతి రౌడీషీటర్‌పై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంటుందని మంగళగిరి రూరల్ ఎస్‌ఐ క్రాంతి కిరణ్ అన్నారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూరల్ పరిధిలోని ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉంచామని, జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రతి రౌడీషీటర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించి, బైండోవర్ చేశామని, కౌంటింగ్ రోజు చట్టవ్యతిరేక చర్యలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన అన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు సమాజంలో సైన్స్ పాత్రపై అవగాహన కల్పించారు. అదేవిధంగా నిత్య జీవితంలో గణితశాస్త్ర ప్రాధాన్యతను విద్యార్థులకు తోటి విద్యార్థులచే చెప్పించారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుజల్లులతో కూడిన వర్షం



తెనాలిఅర్బన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లావ్యాప్తంగా కనిపించింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఈదురు గాలులు వీస్తూ వచ్చాయి. ఉదయం 8గంటల తరువాత ఓ మోస్తరు వర్షం కురిసింది. అక్కడి నుంచి మధ్య మధ్యలో ఆగుతూ చిరుజల్లులతో కూడిన వర్షం పడుతూ వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. జిల్లావ్యాప్తంగా ఉదయం నుంచి ముసురు వాతావరణం కనిపించింది. ఇప్పటివరకు వేసవి తాపంతో అల్లాడిన ప్రజలు కొంత సేదతీరారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

- అత్యంత సమస్యాత్మకంగా పల్నాడు జిల్లా
- జిల్లాలో 150 సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- 1,666 మంది ట్రబుల్ మంగర్స్ పై ప్రత్యేక నిఘా ఏర్పాటు
- జిల్లాలో ఏడు సీఐఎస్‌ఎఫ్ కంపెనీల తోపాటు ఏపీఎస్పీ పోలీసులు
- కౌంటింగ్ కేంద్రాలతోపాటు జిల్లా వ్యాప్తంగా బందోబస్తు
- పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్



మాట్లాడుతున్న ఎస్పీ మలికా గార్గ్

సత్తెనపల్లి: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీ కార్యాలయాన్ని శనివారం ఆమె సందర్శించారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలతో సమీక్ష నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా సబ్ డివిజన్‌లో ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ సాధారణ ఎన్నికల ప్రక్రియ ముగిసేందుకు జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరగాల్సి ఉందన్నారు. జిల్లాలో పలు సంఘటనలు జరిగిన నేపథ్యంలో అత్యంత సమస్యాత్మక జిల్లాగా పల్నాడు ఉందన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల రోజున హింసాత్మక ఘటనలకు తావు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎవరైనా హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇప్పటికే జిల్లాలో 150 సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని చెప్పారు. మొదటి విడతగా 1,666 ట్రబుల్ మంగర్స్‌ను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే 150 కేసులు నమోదు చేశామని, విచారణ వేగవంతంగా జరుగుతుందన్నారు. మాచర్ల, నరసరావుపేట నియోజకవర్గాల్లో అరెస్టులు ఎక్కువ చేశామన్నారు. గొడవల్లో భాగస్వాములయ్యే వారిపై రౌడీషీట్స్ కూడా ఓపెన్ చేస్తామన్నారు. ఎక్కడైనా పెట్రోల్ దొరికితే పెట్రోలియం యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్, డాక్యుమెంట్ లేని వాహనాలను సీజ్ చేస్తున్నామన్నారు. రౌడీ షీటర్స్, ట్రబుల్ మంగర్స్ గొడవల్లో భాగస్వాములు అయితే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లాలో ఏడు సీఐఎస్‌ఎఫ్ కంపెనీలు ఉన్నాయని వీటితోపాటు ఏపీఎస్పీ పోలీసుల సేవలను వినియోగించుకోవడం జరుగుతుందన్నారు.

కౌంటింగ్ ప్రశాంతంగా సక్రమంగా జరగాలని, అన్ని రాజకీయపార్టీలు, ప్రజలు దీనికి సహకరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందని, ఏ పార్టీ వారైనా తప్పు చేస్తే వదిలే ప్రసక్తే లేదన్నారు. కౌంటింగ్ వద్ద మాత్రమే కాకుండా జిల్లా మొత్తం బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అల్లర్లు, గొడవలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలన్నారు. రోడ్లపైకి వచ్చి గొడవల్లో పాల్గొంటే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు ఉన్నారని, పోలీసులకు సహకరించాలన్నారు. పోలీసుల భద్రతే మీ భద్రత అన్నారు. సమావేశంలో సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్‌బాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

- విద్యార్థులూ... సర్టిఫికెట్లు సిద్ధం చేసుకోండి
- జూన్ 3వరకు సర్టిఫికెట్ల పరిశీలన
- ఈనెల 31 నుంచి కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్ల నమోదు

గుంటూరుఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికై ఉద్దేశించిన పాలిసెట్–2024 కౌన్సెలింగ్ ఈనెల 27 నుంచి జరగనుంది. పాలిసెట్–2024లో అర్హత సాధించిన విద్యార్థులు జూన్ మూడో తేదీ వరకు జరగనున్న కౌన్సెలింగ్‌లో ఆయా ర్యాంకుల వారీగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంది. ఇందుకోసం రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ గుంటూరు నగర శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. పాలిసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాగోరు విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ఆన్‌లైన్‌లో రుసుం చెల్లించాలి. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన విద్యార్థులు ఈనెల 31 నుంచి జూన్ 5వ తేదీ వరకు ర్యాంకుల వారీగా ఆయా తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాల్సి ఉంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది.

- విద్యార్థులు తమ వెంట ఫీజు రసీదు, హాల్ టిక్కెట్, ర్యాంకు కార్డు, టెన్త్ పాస్ సర్టిఫికెట్, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఓసీ విద్యార్థులు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు తీసుకురావాలని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న టి. శేఖర్ సూచించారు. స్పోర్ట్స్, గేమ్స్, ఎన్‌సీసీ ప్రత్యేక కేటగిరీలకు చెందిన విద్యార్థులు విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హాజరు కావాల్సి ఉంది.
- ఈనెల 27న ఒకటో ర్యాంకు నుంచి 12వేలు, 28న 12,001 నుంచి 27వేలు, 29న 27,001 నుంచి 43వేలు, 30న 43,001 నుంచి 59వేలు, 31న 59,001 నుంచి 75వేలు, జూన్ 1న 75,001 నుంచి 92వేలు, జూన్ 2న 92,001 నుంచి 1,08,000, జూన్ 3న 1,08,001 నుంచి ఆపై చివరి ర్యాంకు వరకు హాజరు కావాలి.
- సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈనెల 31నుంచి జూన్ ఐదో తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలలను ఎంపిక చేసుకునేందుకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంది. కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలకు https:// appolycet.nic.in సైట్‌కు లాగిన్ అవ్వాలి.

బడి తెరిచిన రోజే కానుక

సిద్ధమవుతున్న జగనన్న విద్యా కానుక కిట్లు

- ఐదో విడత పంపిణీకి ఏర్పాట్లు
- గుంటూరు జిల్లాలో 99,150 మంది విద్యార్థులకు చేకూరనున్న లబ్ధి
- మండలాలకు చేరిన పాఠ్య, నోటు పుస్తకాలు



విద్యాకానుక మెటీరియల్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్న ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది విద్యాకానుక స్టూడెంట్ కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రిగా అధికార పగ్గాలు చేపట్టింది మొదలు ప్రభుత్వ పాఠశాలల స్వరూపాన్ని మార్చివేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. ప్రతి యేటా అరకొరగా అందించే పాఠ్య పుస్తకాలు, యూనిఫాంల స్థానంలో ప్రవేశపెట్టిన జగనన్న విద్యాకానుక(జేవీకే)ను గత నాలుగేళ్లుగా నిరాటంకంగా అందజేస్తున్నారు.

జూన్ మొదటివారానికి పాఠశాలలకు కిట్లు..

సార్వత్రిక ఎన్నికల కారణంగా పంపిణీకి ఎక్కడా విఘాతం కలగరాదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం 2024–25 విద్యాసంవత్సరానికి అవసరమైన విద్యాకానుక కిట్లను ముందుగానే సిద్ధం చేసింది. ఫలితంగా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికార యంత్రాంగం ప్రస్తుతం పంపిణీలో నిమగ్నమయ్యారు. జూన్ మొదటి వారానికి విద్యాకానుక కిట్‌లలో మెటీరియల్ మొత్తం మండలాల్లోని స్టాక్ పాయింట్లకు చేరుతుందని అధికారులు చెబుతున్నారు.

మండలాలకు చేరవేత..

విద్యాకానుక కిట్లతో పాటు పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన మెటీరియల్ గుంటూరు జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు సరఫరా అవుతోంది. ప్రభుత్వానికి పంపిన ఇండెంట్‌కు అనుగుణంగా కిట్‌లోని వివిధ సామగ్రిని ప్రతి రోజూ ఎక్కడికక్కడ మండలాలకు చేరవేస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరానికి గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 99,150 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు. గత విద్యాసంవత్సరంలో ఎన్‌రోల్ అయిన విద్యార్థులకు సరిపడా ఇండెంట్ పంపిన అధికారులు పాఠశాలల్లో కొత్తగా ప్రవేశం పొందే విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మరో 10 శాతం మెటీరియల్‌ను సిద్ధం చేస్తున్నారు.



స్టాక్ పాయింట్‌లోని నోటు పుస్తకాల బాక్సులను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి

నాలుగేళ్లలో 5.21 లక్షల కిట్లు పంపిణీ

గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గత నాలుగు విద్యా సంవత్సరాల్లో 5,21,380 కిట్‌లను పంపిణీ చేసిన ప్రభుత్వం, రూ.95.96 కోట్లు వెచ్చించింది. గత నాలుగేళ్లుగా వరుసగా ప్రతి యేటా పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక కిట్ల పంపిణీని పండుగలా నిర్వహించింది. చదువుకునేందుకు అవసరమైన అన్నిరకాల సామగ్రిని ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం నుంచి ఉపశమనం కలిగించింది.

పాఠశాలలు తెరిచిన రోజే కిట్లు పంపిణీ..

ఐదో విడతలో పంపిణీ చేయాల్సిన విద్యా కానుక కిట్లను సిద్ధం చేస్తున్నాం. సరఫరాదారుల నుంచి వస్తున్న సామగ్రిని ఎప్పటికప్పుడు మండల స్టాక్ పాయింట్లకు చేరవేస్తున్నాం. జూన్ మొదటి వారానికి అన్ని రకాల సామగ్రి ఇండెంట్ ప్రకారం వస్తుందని ఉన్నతాధికారులు సమాచారం ఇచ్చారు. పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తాం.

– జి.విజయలక్ష్మి, ఏపీసీ, సమగ్రశిక్ష, గుంటూరు

జిల్లాలో ఇప్పటివరకు వచ్చిన మెటీరియల్..

ఐటం పేరు	ఇండెంట్	అందినవి	రావాల్సినవి
బ్యాగు	99,150	–	99,150
నోటు పుస్తకాలు	6,06,430	6,06,166	264
పాఠ్య పుస్తకాలు	6,79,824	1,15,470	5,64,354
బూట్లు	99,704	–	99,704
యూనిఫాం	99,150	–	99,150
బెల్టులు	68,824	–	68,824
డిక్షనరీలు	19,104	–	19,104

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- లైసెన్స్ నిబంధనలకు లోబడి వ్యాపారం చేయాలి
- గుంటూరు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు

కొరిటిపాడు(గుంటూరు): రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, అనుమతిలేని విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. డీలర్లు అందరూ లైసెన్స్ నిబంధనలకు లోబడి వ్యాపారం నిర్వహించాలని ఆదేశించారు. స్థానిక కృషిభవన్‌లో గుంటూరు నగరంలోని విత్తన ఉత్పత్తిదారులు, డీలర్లతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. షాపుల ముందు నిల్వ, ధరలను సూచించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ అధికారుల నుంచి స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలు ధ్రువీకరణ చేయించుకొని వాడాలన్నారు. ప్రతి విత్తనం యొక్క సర్టిఫికెట్ ఆఫ్ సోర్స్, ఇతర వివరాలు ఉండాలన్నారు. రైతులు ఏ రకం విత్తనాలు అడిగితే ఆ రకం విత్తనాలు మాత్రమే అందించాలని, ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సొంత భవనంలోకి కేంద్రియ విద్యాలయం

- ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం
- ఇర్లపాడు వద్ద తుది దశకు నిర్మాణ పనులు



ఇర్లపాడులో నిర్మాణంలో ఉన్న కేంద్రియ విద్యాలయ భవనం

నాదెండ్ల: చిలకలూరిపేట విద్యారంగంలో మణిహారమైన కేంద్రియ విద్యాలయం 2024 విద్యా సంవత్సరానికి సొంత భవనంలో ప్రారంభానికి సిద్ధమౌతోంది. మండలంలోని ఇర్లపాడులో సుమారు రూ.19.8 కోట్ల వ్యయంతో నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. విద్యాలయం పనులు తుది దశకు చేరాయి. ఈ విద్యాసంవత్సరం నుండే విద్యాలయం ప్రారంభం కానుంది.

2018లో ఈ పాఠశాలకు అనుమతులు రాగా, 2019 నుంచి గణపవరంలోని సీఆర్ పాలిటెక్నిక్ కళాశాల భవనాల్లో తాత్కాలికంగా క్లాసులు నిర్వహిస్తున్నారు. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకూ ఇక్కడ తరగతులు నిర్వహించనున్నారు. నాణ్యమైన ఒత్తిడి లేని విద్యకు ఈ పాఠశాల మారుపేరుగా ఉంది. ఈ పాఠశాలలో సీటు రావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది. ఆపై ఖాళీల్లో రిజర్వేషన్ వారీగా కేటాయింపులు చేస్తారు.

9.61 ఎకరాల విస్తీర్ణంలో...

కేంద్రియ విద్యాలయానికి అనుమతులు రావాలంటే కనీసం పదెకరాలు స్థలం ఉండి తీరాలి. అప్పట్లో నాదెండ్ల రెవెన్యూ అధికారులు ఇర్లపాడు గ్రామ రెవెన్యూ పరిధిలో 10.10 ఎకరాల విస్తీర్ణాన్ని అప్పగించారు. సుమారు 50 సెంట్ల విస్తీర్ణంలో పక్కనే ఉన్న జగనన్న కాలనీకి అవసరమైన రోడ్లకు వదిలారు. ప్రస్తుతం 9.61 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రూ.19.8 కోట్ల వ్యయంతో...

విద్యాలయంలో తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీ, ఉపాధ్యాయులకు అవసరమైన స్టాఫ్ రూమ్‌లతో పాటూ సిబ్బందికి అవసరమైన క్వార్టర్స్ నిర్మాణాలు జరుగుతున్నాయి. తిరుపతికి చెందిన సీఎన్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారు నిర్మాణ పనులు జరుపుతున్నారు. సీపీడబ్ల్యూడీ విజయవాడ డివిజన్ అధికారులు పనులు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం గణపవరంలోని సీఆర్ కళాశాలలో విద్యాలయం తాత్కాలికంగా నడుస్తుండగా, 9వ తరగతి వరకూ విద్యాభ్యాసం కొనసాగుతోంది. 2024 విద్యాసంవత్సరంలో పదో తరగతి బ్యాచ్ ప్రారంభం కానుంది. 2025 నుండి ఇంటర్ మొదటి సంవత్సరం, ఆ తర్వాత ఏడాది ఇంటర్ రెండో సంవత్సరం బ్యాచ్ ప్రారంభం కానుంది. వీటికి సంబంధించి కూడా నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

నాణ్యమైన ఒత్తిడి లేని విద్య



నాణ్యమైన ఒత్తిడి లేని విద్యతోపాటూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కేంద్రియ విద్యాలయం పెట్టింది పేరు. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తాం. ప్రస్తుతం గణపవరంలో తాత్కాలిక భవనాల్లో నడుస్తున్న విద్యాలయంలో 2024 విద్యా సంవత్సరంలో నూతన భవనాల్లో ప్రారంభం కానుంది.

– సునీతసింగ్, ఇన్‌చార్జి ప్రిన్సిపల్

దుర్గమ్మ సేవలో చాగంటి కోటేశ్వరరావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వారికి ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఈఓ రామరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో పాటు శ్రీకనకదుర్గ వైభవం పుస్తకాన్ని అందజేశారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారితో పాటు



అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామిని చాగంటి కోటేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు.

అల్లర్లకు పాల్పడితే జిల్లా బహిష్కరణ

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్‌జిందాల్

చీరాల రూరల్: ఎన్నికల కౌంటింగ్ రోజు అల్లర్లు, గొడవలకు పాల్పడిన నిందితులను గుర్తించి రౌడీషీట్లు తెరవడమే కాకుండా నగర బహిష్కరణ కూడా చేస్తామని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌ను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ డాక్టర్ వకుల్ జిందాల్‌తో కలసి సందర్శించారు. నియోజకవర్గ పరిధిలోని పోలీసు అధికారులతో వారు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎన్నికల రోజు జరిగిన తదనంతర పరిణామాలు, ఘర్షణలకు నమోదు చేసిన కేసుల వివరాలపై వారు సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తీసుకుంటున్న భద్రతా చర్యల గురించి సమీక్షించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడారు. చీరాల నియోజకవర్గ పరిధిలో ఎన్నికల రోజున జరిగిన అల్లర్లు, గొడవలు, అరెస్టులపై కేసుల్లో జరుగుతున్న దర్యాప్తును పరిశీలించేందుకు ఐజీ త్రిపాఠి చీరాల పోలీసుస్టేషన్‌ను సందర్శించారని చెప్పారు. శాంతి భద్రతల విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా విధులు నిర్వర్తించేలా సిబ్బందికి సూచించినట్లు చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ రోజు చీరాల నియోజకవర్గంలో సెక్షన్ 144 సీఆర్పీసీ, పోలీసు 30 యాక్టు అమలులో ఉంటుందని తెలిపారు. ఎక్కడా గుంపులు గుంపులుగా సంచరించరాదన్నారు. రాజకీయ నాయకులు ప్రజలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయరాదని సూచించారు. అలానే ర్యాలీలు, ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున ప్రజలు కూడా సంయమనంతో వ్యవహరించి కౌంటింగ్ సజావుగా సాగేందుకు సహకరించాలని, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా అటువంటి వారిపై రౌడీ షీట్లు తెరుస్తామని, పలుమార్లు ఘర్షణలకు పాల్పడినవారిపై పీడీ చట్టం ప్రయోగించి జిల్లా బహిష్కరణ కూడా చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల రోజు ఘర్షణలకు పాల్పడిన వారిపై కలెక్టర్‌కు నివేదిక కూడా అందజేశామని త్వరలో చర్యలు చేపడతామని చెప్పారు. జిల్లాలో జూన్ 6 వరకు బాణసంచా విక్రయించరాదని నిర్వాహకులకు ఆజ్ఞలు జారీ చేసినట్లు చెప్పారు. పెట్రోలు బంకుల్లో బాటిళ్లలో లూజ్ పెట్రోలు విక్రయించరాదని సూచించామని, నిబంధనలు అతిక్రమించే బంకుల లైసెన్సులు కూడా రద్దు చేస్తామని చెప్పారు. కౌంటింగ్ రోజున ప్రశాంత వాతావరణం ఉండేలా ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐలు శేషగిరిరావు, సోమశేఖర్, బి.శ్రీనివాసరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

మైనార్టీ పాఠశాల, కళాశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతి, జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ శిరీషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ముస్లిం, మైనార్టీ విద్యార్థులకు ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా జూనియర్ ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

పెదగార్లపాడులో కార్డెన్ సెర్చ్



దాచేపల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎ.సురేంద్రబాబు హెచ్చరించారు. మండలంలోని పెదగార్లపాడులో కార్డన్ సెర్చ్‌ని శనివారం చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఎరువు దిబ్బలు, వరిగడ్డి వాములలో కూడా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ సురేంద్రబాబు మాట్లాడుతూ... గ్రామాల్లో అందరు అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలని, రాజకీయ వివాదాల జోలికి వెళ్లవద్దని చెప్పారు. ఎన్నికల్లో ఏ పార్టీ గెలిచిన.. ఓడిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని, శాంతిభద్రతల సమస్యలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు దాసరి శివనాగరాజు, జి. సంధ్యారాణి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

నాదెండ్ల: గుంటూరు-కర్నూలు రాష్ట్రీయ రహదారి సాతులూరు సమీపంలో కోళ్లఫారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, పేరేచర్లకు చెందిన శ్రీనివాసరావు, బోయపాలెంకు చెందిన దేవదానం ఇరువురూ ద్విచక్ర వాహనంపై వెళ్తూ ముందు వెళ్తున్న ట్యాంకర్‌ను ఢీకొన్నారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురూ నాలుగు రోజుల క్రితమే కోళ్లఫారంలో పనిలో చేరారు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. ఇరువురినీ 108 సాయంతో నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు సమాచారం.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

నాదెండ్ల: ద్విచక్ర వాహనం ఢీకొని రహదారి దాటుతున్న ఓ మహిళ మృతిచెందిన ఘటన సాతులూరులో శుక్రవారం రాత్రి సాతులూరులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జెట్టిపాటి శివమ్మ (35) పన్నెండేళ్ల క్రితం తన పక్కింటి మహిళకు రూ.10 వేలు అప్పుగా ఇచ్చింది. డబ్బులు తిరిగి ఇవ్వమని ఎన్నిసార్లు అడిగినా ఫలితం లేకపోవటంతో పెద్దలను ఆశ్రయించింది. గ్రామ పెద్దలైన గద్దె కోటేశ్వరరావు, రావుల శ్రీనివాసరావు, పాటిబండ్ల శేఖర్ వద్దకు వెళ్లి విషయం తెలిపి సహాయం కోరింది. అప్పు తీసుకున్న వారితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో తిరిగి తన ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో గుంటూరు నుంచి ఇసప్పాలెంకు వెళ్తున్న ద్విచక్ర వాహనం బలంగా ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన శివమ్మను స్థానికులు 108 సాయంతో చిలకలూరిపేట ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరులో మరో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. భర్త జెట్టిపాటి అంకారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బలరామ్‌రెడ్డి తెలిపారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల ఎదుగుదలకు శాఖా గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు ఉపయోగపడతాయని ఉమ్మడి గుంటూరుజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ తెలిపారు. పల్నాడు రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాన్ని శనివారం ఆమె సందర్శించారు. శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులతో మాట్లాడి వారి మాటల ద్వారానే శిబిరం ఉపయోగాలను చెప్పించారు. ఈసందర్భంగా సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ, ఉమ్మడి గుంటూరు జిల్లాలో 97 శాఖా గ్రంథాలయాలలో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. చిన్నతనం నుంచే సెల్‌ఫోన్, టీవీలకు అలవాటు పడుతున్న చిన్నారులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు శిబిరాలు దోహదపడతాయన్నారు. జ్ఞాన సంపదను పెంపొందించుకోవటంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. పుస్తక పఠనం విద్యార్థుల అభ్యున్నతికి బాటలు వేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం:స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన తరగతులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని శావల్యాపురం గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ శనివారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 0-5 నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు కల్గిన చిన్నారులకు శిక్షణ తరగతులను జరుగుతున్నాయని, ఉదయం 8 గంటల నుంచి 12 గంటల పుస్తక పఠనం, కథలు చెప్పటం, రాయటం, స్పోకెన్ ఇంగ్లిషు, చిత్రలేఖనం, సంగీతం, నాట్యం, ఉపన్యాసం అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. వచ్చే నెల 7వ వరకు వేసవి శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. అనంతరం చిన్నారులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాససింగ్, చెన్నుబాబు, మద్దికుంట ఆంజనేయులు, చెవల శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులతో కార్యదర్శి సుబ్బరత్నమ్మ, రాధ

గ్రంథాలయంలో వేసవిశిక్షణతరగతులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వినుకొండ శాఖ గ్రంథాలయలో వేసవి శిక్షణతరగతులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం విద్యార్థులకు రంగు కాగితాలతో చిత్రాలు తయారు చేయడం నేర్పించడం జరిగిందని గ్రంథాలయ శాఖాధికారి భూక్యా బద్రీనాయక్ తెలిపారు. కథలు చదవడం, కథలు చెప్పడం మాకిష్టం అనే కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



రంగు కాగితాలతో చిత్రాలు తయారు చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

నాదెండ్ల: విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని నాదెండ్ల శాఖా గ్రంథాలయాధికారి రావూరి శ్రీనివాసరావు చెప్పారు.



విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న శ్రీనివాసరావు



క్యారమ్స్ ఆడుతున్న చిన్నారులు

మండల కేంద్రమైన నాదెండ్ల శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను పురస్కరించుకుని శనివారం నూతన పుస్తకాల పరిచయం నిర్వహించారు. చిన్నారులకు పలురకాల కథల పుస్తకాలు, సైన్స్, గణితం, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందించి అందులోని విషయాలపై అవగాహన కల్పించారు.

ఎస్సీ అట్రాసిటీ కేసును విచారించిన డీఎస్పీ

ఈపూరు: ఎస్సీ అట్రాసిటీ కేసును విచారించేందుకు శనివారం మండలంలోని కొండ్రముట్ల ఎస్సీ కాలనీని డీఎస్పీ సుధాకర్ సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎస్సీ కాలనీకి చెందిన మక్కెన శౌరిని గ్రామానికి చెందిన కొందరు కులం పేరుతో దూషించి దాడికి దిగారని, దీంతో ఆయన కులం పేరుతో దూషించినందుకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఫిర్యాదు మేరకు నరసరావుపేట డీఎస్పీ సుధాకర్ కాలనీని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

వేల్పూరులో

శావల్యాపురం: మండల పరిధిలోని వేల్పూరులో ఎన్నికల నేపథ్యంలో ఎస్సీ వర్గీయులపై దాడికి పాల్పడిన సంఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు ఘటనపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున సభలు సమావేశాలు నిర్వహించరాదన్నారు. అనంతరం ఎస్సీ కేసులో జరిగిన సమగ్ర వివరాలను పోలింగ్ కేంద్రం అవరణలో సంఘటన సమయంలో ఉన్ననటు వంటి వారి ద్వారా వివరాలు అడిగి తెలుసుకొని నమోదు చేసుకున్నారు. ఆయనతో పాటు వినుకొండ రూరల్ సీఐ ఉప్పటూరి సుధాకరరావు, ఎస్సై చల్లా సురేష్, సిబ్బంది ఉన్నారు.



ఎస్సీ కేసులో విచారణ చేస్తున్న డీఎస్పీ సుధాకరరావు

వేర్వేరు గ్రామాల్లో డీఎస్పీ విచారణ

బొల్లాపల్లి: ఎన్నికల అనంతరం జరిగిన దాడుల పై నమోదైన కేసులపై నర్సరావుపేట డీఎస్పీ ఎం సుదాకరరావు శనివారం సాయంత్రం విచారణ చేపట్టారు. గుట్లపల్లి, బొల్లాపల్లి ఎస్సీ కాలనీలను సందర్శించి బాధితులను, గ్రామస్తులను విచారించారు. దాడికి గురైన బాధితుల నుంచి వివరాలు సేకరించారు.

కారెంపూడి అల్లర్ల కేసుల్లో 25 మంది అరెస్టు

కారెంపూడి: సార్వత్రిక ఎన్నికల అనంతరం కారెంపూడిలో గత 14వ తేదీ చెలరేగిన అల్లర్లు ఆస్తుల విధ్వంసాల కేసులకు సంబంధించి ఇప్పటి వరకు 25 మందిని అరెస్టు చేశామని ఎస్ఐ కె అమీర్ శనివారం తెలిపారు. మూకుమ్మడిగా కారెంపూడిలో పలు షాపులు, ఇళ్లపై దాడులకు పాల్పడడం, పార్క్ చేసిన వాహనాలను నిప్పంటించి దహనం చేయడం ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం లాంటి దుశ్చర్యలకు పాల్పడిన రెండు ఘటనలకు సంబంధించి రెండు కేసులు రిజిస్టర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఆ కేసుల్లో నిందితులను గుర్తించి అరెస్టులు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రెండు కేసుల్లో 25 మంది నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచడం జరిగిందని ఎస్ఐ అమీర్ వెల్లడించారు. అలాగే మండలంలోని ఒప్పిచర్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలోని ఒక పోలింగ్ బూత్‌లో 13వ తేదీ పోలింగ్ నాడు ఈవీఎం పగులగొట్టిన కేసులో గ్రామానికి చెందిన ఒకరిని అరెస్టు చేయడం జరిగిందని ఎస్ఐ అమీర్ పేర్కొన్నారు.

గొడవలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

వినుకొండ రూరల్ సీఐ సుధాకరరావు

శావల్యాపురం: సార్వత్రిక ఎన్నికల అనంతరం గ్రామాల్లో గొడవులు అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకరరావు హెచ్చరించారు. శనివారం మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టడంతో పాటు గ్రామంలో మరణాదాయులు,నాటు బాంబులు ఉన్నాయేమా అని ముందస్తు సోదాలు పోలీసులు చేశారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ సుధాకరరావు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం గ్రామాల్లో శాంతి భద్రతలు విఘాతం కలుగకుండా ఉండటానికి ఈ సోదాలు చేస్తున్నట్లు తెలిపారు. యువత ఇటువంటి రాజకీయ అల్లర్ల, గొడవులకు దూరంగా ఉండాలన్నారు. ఓటు వినియోగించుకోవటం ప్రతి పౌరుడు ప్రాథమిక హక్కు అయితే రాజకీయ గొడవులు, అల్లర్లకు దూరంగా ఉండటం నైతిక హక్కుగా ప్రతి ఒక్కరు భావించాలన్నారు. అనంతరం గ్రామంలో సరైనా పత్రాలు లేని బైకులు స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషనుకు తరలించారు. కార్డన్ సెర్చ్ కార్యక్రమంలో ఎస్సైలు చల్లా సురేష్, లక్ష్మీ నారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లపాడులో..

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడులో గ్రామంలో శనివారం మాచర్ల రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ వెంకట్రావుల ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ పోలీసు సిబ్బందితో గ్రామంలో పోలీసు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో పోలీసు కార్డన్ సెర్చ్‌ను నిర్వహించటం జరుగుతుందన్నారు. అందులో భాగంగా గుండ్ల పాడు గ్రామంలోని కార్డన్ సెర్చ్ లో భాగంగా ఇళ్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్నామన్నారు. వాహన యజమానులు సరైన ధృవీకరణ పత్రాలు చూపించి వాహనాలను తీసుకెళ్ళాలన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హనుమంతు, డీఎస్పీ శివరాజ్, సీఐలు సుబ్బారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మతుకుమల్లిలో బైకులు స్వాధీనం చేసుకున్న పోలీసులు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

పిడుగురాళ్ల: ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే అటువంటివారిపై శాఖ పరమైన చర్యలు తప్పవని పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీఖాన్ శనివారం తెలిపారు. మండలంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జరిగిన అల్లర్లకు పాల్పడిన సుమారు 40 మందిని అరెస్టు చేసి వారిని రాజమండ్రి, నెల్లూరు సెంట్రల్ జైలుకు పంపించటం జరిగిందన్నారు. జూన్ 4వ తేదీన ఎన్నికల కౌటింగ్ జరుగుతుందని, కౌటింగ్ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు కానీ, కార్యకర్తలు కానీ, యువకులు కానీ ఎవరైనా గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అటువంటివారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అవసరమైతే అల్లర్లకు పాల్పడిన వారిపై రౌడీ షీట్లు కూడా ఓపెన్ చేయటం జరుగుతుందని హెచ్చరించారు.

సంక్షిప్తం

■ 'రోహిణి'కి వరుణుడు స్వాగతం!

రొంపిచర్ల: ప్రస్తుత తరుణంలో నెలకొన్న వాతావరణాన్ని పరిశీలిస్తే రోహిణి కార్తెలో ఎండలు శాంతించాయని అనిపిస్తుంది. ప్రతి ఏటా ఉగాది మొదలు గ్రీష్మతాపం రోజురోజుకు పెరుగుతూ ఉంటుంది. రోహిణి కార్తె ప్రవేశించిందంటే ఆ కార్తెలో కాసే ఎండలకు రోళ్లు కూడా పగులుతాయన్న నానుడి ప్రజల్లో ఉంది. ఈ సంవత్సరం రోహిణి కార్తె శనివారం ఆరంభమైంది. అయినప్పటికీ తెల్లవారుజాము నుండే చల్లటి వాతావరణం, పుల్ల చినుకులు పడుతున్నాయి. దీనికితోడు వాతావరణం చల్లగా ఉన్నా ఉక్కపోత నెలకొనడంతో వర్షాలు కురుస్తాయన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడింది. ఈ వాతావరణం ఇలాగే కొనసాగి వర్షాలు కురిస్తే రోహిణికార్తెలో కాసే ఎండల నుంచి ప్రజలు ఈ ఏడాదికి ఉపశమనం పొందినట్లే. కాగా వర్షాలు సంవృద్ధిగా పడితే పూర్వకాలంలోలాగానే పంట పొలాలను తొలకరి దుక్కులు దున్నుకునే అవాకాశం ఏర్పడుతుందని రైతులు అంటున్నారు. తొలకరిలో దుక్కులు దున్ని సిద్ధం చేసుకొంటే తరువాత కార్తెలో విత్తనాలు విత్తుకోవచ్చని రైతులు భావిస్తున్నారు.

■ ఖరీఫ్ సీజన్‌కు సరిపడా పత్తి విత్తనాలు

చిలకలూరిపేట: ఖరీఫ్ సీజన్‌కు సరిపడ పత్తివిత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి టి శ్రీలత చెప్పారు. పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిలకలూరిపేట మండల పరిధిలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌లో 4,116 ఎకరాల్లో పత్తిపాటి సాగు చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తిపంట గత ఏడాది కన్నా 10 శాతం పెరుగుతుందని అంచనా వేసినట్లు వెల్లడించారు. మండలంలో పత్తిపంట సాగుకు సరిపడా విత్తనాల కంటే కూడా ఎక్కువ మోతాదులో విత్తనాలు రైతుభరోసా కేంద్రాలు, విత్తన దుకాణాల ద్వారా పంపిణీ చేసేందుకు ముందస్తు ప్రణాళికను ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే రూపొందించటం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఎవరూ అధిక ధరలకు విత్తనాలు విక్రయించరాదన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత లాట్ నంబర్‌తో కూడిన రసీదును తప్పనిసరిగా దుకాణదారుడి వద్ద తీసుకొని వాటిని సీజన్ ముగిసే వరకు భద్రంగా దాచుకోవాలన్నారు. విత్తనాలను ఎవరైనా దుకాణదారుడు ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువగా విక్రయిస్తే స్థానిక వ్యవసాయాధికారి సెల్ నంబర్ 8331056944, లేదా సహాయ వ్యవసాయ సంచాలకులు సెల్ నంబర్ 8331056941కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా విత్తన దుకాణాలో నిరంతర తనిఖీలు నిర్వహించటం జరుగుతుందన్నారు.

■ దివ్యాంగ హాస్టల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: దివ్యాంగ బాల బాలికల వసతి గృహాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు విభిన్న ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు సి.హెచ్. సువార్త శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలోని నరసరావుపేట పట్టణం, నకరికల్లు మండలం చల్లగుండ్లలోని వసతి గృహాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. వీరికి వసతితో పాటు భోజనం, దుస్తులు, పుస్తకాలు, బెడ్డింగ్ మెటీరియల్ వంటివి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఉచితంగా అందిస్తామని వివరించారు. వివరాలకు ఎస్.సతీష్‌కుమార్ గ్రేడ్-1 వార్డెన్ 984934 7904 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

■ వారానికి రెండుసార్లు శుభ్రం

నరసరావుపేట: వర్షాకాలం రానున్న తరుణంలో పట్టణంలోని ప్రతి వార్డులో వారానికి రెండుసార్లు మురుగు కాలువలు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పురపాలకసంఘం పరిధిలోని 30వ వార్డు ఏనుగులు బజార్‌లో కాలువల్లో పూడిక తీసే కార్యక్రమాన్ని పరిశీలించారు. అక్కడక్కడా పేరుకుపోయిన చెత్తకుప్పలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. శానిటేషన్ ఇనస్పెక్టర్ రామకోటయ్య, అసిస్టెంట్ ఇంజనీర్ స్వర్ణరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కార్యదర్శి

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, రొంపిచర్ల గ్రామాల్లో గల శాఖా గ్రంథాలయాలను జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి. సుబ్బరత్తమ్మ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించారు. శిక్షణ నిర్వహణపై వారు అమలు పరుస్తున్న కార్యక్రమాలను ఇన్‌చార్జి గ్రంథాలయ అధికారి కె. వెంకట్రావును అడిగి తెలుసుకున్నారు. వేసవి శిక్షణా శిబిరంలో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె గ్రంథాలయ అధికారిని ఆదేశించారు. గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు.

సప్లిమెంటరీకి 16 మంది గైర్హాజరు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో శనివారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష జరిగింది. 395 మందికి గాను 16 మంది గైర్హాజరు కాగా 379 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా సత్తెనపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ శ్రీలక్ష్మీ, అసోసియేటెడ్ చీఫ్ సూపరింటెండెంట్‌గా కళాశాల వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య వ్యవహరించారు. డీఈసీ బృందం తనిఖీ చేశారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని ఉప్పరపాలెం గ్రామ రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కె. యేసురత్నం శుక్రవారం రాత్రి తన స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందాడు. యేసురత్నంకు భార్య, కుమార్తె, ఇరువురు కుమారులు కలరు. తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, తోటి వీఆర్వోలు సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.